ఆంధ్రప్రదేశ్ - జూలై 1999

# మేనమామ బిడ్డ

డిసెంబరు నెల. బయట చలి మనుషుల్ని గడ్డ కట్టిస్తున్నా, అందమైన ఉద్యానవనానికి పక్కగా ఉన్న ఓ పెద్ద భవనం లోపలి వాతావరణం వెచ్చగా ఉంది. ఓ ప్రభుత్వరంగ సంస్థ తాలూకు క్లబ్ భవనమది. అందులో జరుగుతున్న పార్టీ హైసొసైటీ పార్టీ కాకపోయినా, కాస్త అంతో ఇంతో హోదా గల ఆఫీసర్లు, వాళ్ళ డైరెక్టర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అయిన శుభసందర్భంగా ఇస్తున్న ఓ కాలక్షేపం మొక్కుబడి పార్టీ. అయితే 'ఎవరెంత చందాలేసుకొన్నారూ?' అని అడక్కుండా ఉంటే, అజ్ఞాతంగా ఆ పార్టీకి మదుపు పెట్టిన ఓ వాణిజ్యవేత్త కృత్రిమంగా హైసొసైటీ పార్టీ రంగు తీసుకొచ్చిన మాట వాస్తవం.

విడివిడిగా, జంటలు జంటలుగా, గుంపులు గుంపులుగా తిరుగుతున్న స్త్రీ పురుషుల చేతుల్లో కోలా గ్లాసూలూ (?), విస్కీ గ్లాసులూ మంద్రస్థాయి దీపాల వెల్తుర్లో నిండుతున్నాయి. ఖాళీ అవుతున్నాయి. ఎమ్.డి. చుట్టూ స్తోత్ర పాఠకులు కొంతమంది తమ విధుల్ని నిర్వహిస్తున్నారు. మరికొంతమంది అక్కడా, అక్కడా నిల్చునీ, కూర్చునీ ఏవేవో కబుర్లు

చెప్పుకొంటున్నారు.

ఉన్నట్టుండి రీసెర్చ్ లేబరేటరీస్ హెడ్ సతీష్ భాటియా భార్య శ్రీమతి రూబీ భాటియా సైంటిస్ట్ కృష్ణమూర్తి భార్య సుజాత నుద్దేశించి, "నీ భర్త మీ నాన్నగారి అక్క కొడుకట కదా?" అంది కోలా గ్లాసు రెండు చేతుల మధ్యా తిప్పుతూ. సుజాత ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది.

"అయితే...?" ప్రశ్నార్థకంగా ఆగిపోయింది సుజాత.

ప్రీతి ముఖర్జీ కలుగజేసుకొంటూ, "ఆంధ్ర రాష్ట్రంలో ఇటువంటి వివాహాలు చాలా జరుగుతాయట! ఎలా చేసుకొంటారోనబ్బా?" అంది కళ్ళింతంత చేసుకొని.

చూస్తుండగానే గుంపు పెరిగింది.

బీరు సేవిస్తున్న వైద్యనాథన్ గొంతు సవరించుకొన్నాడు. మరింతమంది గుంపులో జేరారు. అందరి దృష్టి వైద్యనాథన్ మీదకు మళ్ళింది".

"మీకు తెలుసునో తెలియదో కాని, ఈ రకం పెళ్ళిని తెలుగు వాళ్ళు మేనరికమంటారు. అంతేకాదు, స్వంత అక్క కూతుర్ని కూడా ఆంధ్రాలో పెళ్ళి చేసుకొంటారు?" అన్నాడు అదోలా పోజిస్తూ.

ఎడ్మినిస్ట్రేటివ్ హెడ్, కల్నల్ రాంసింగ్ కృష్ణమూర్తి వైపు చూస్తూ, "వైద్యనాథన్ మాటలు నిజమేనా?" అని ప్రశ్నించాడు.

"అవును, నిజమే - యిందులో తప్పేముంది. అది మాలో అలవాటే?" అన్నాడు కృష్ణమూర్తి కాస్త యిబ్బందిగా.

"ఛ! అంత దగ్గర రక్తసంబంధీకుల్లో పెళ్ళిళ్ళు ఎలా చేసుకుంటారయ్యా మీరు?" - బంసిలాల్, బయోటెక్నాలజీ చీఫ్ ప్రశ్నించాడు. అతడు అప్పటికే కాస్త నిషాలో ఉన్నాడు.

సుజాతకి వళ్ళు కంపరమెత్తసాగింది.

అసలీ సంగతి రూబీ భాటియా కెలా తెలిసిందని? నిస్సందేహంగా మిసెస్ రంగారావు 'అనిత' పనే యిది. తన భర్త కృష్ణమూర్తి అనిత భర్త రంగారావుకి బాస్. ఓసారి ఏదో పని సవ్యంగా జరగలేదని, కృష్ణమూర్తి రంగారావుని మందలించాడు. ఆ కక్ష కొద్దీ అనిత పనికట్టుకొని, ఈ సంగతి రూబీ భాటియా చెవిలో వేసి ఉంటుంది. అయినా తమది మేనరికమైతే ఎవరికెందుకు?' - సుజాత ఆలోచనల పరంపరలోంచి బయటపడ్తూనే, గంగూలీ అన్న మాటలు వింది.

"మా బెంగాలీల్లో ఏడు తరాల్లో ఎక్కడ చుట్టరికం కలిసినా, ఆ సంబంధాన్ని చేసుకోం!"

"దగ్గర సంబంధాలు చేసుకొంటే జన్యుపరమైన చికాకులు చాలా కలుగుతాయట" అంది ప్రీతి ముఖర్జీ కళ్ళింతంత చేసికొని.

"పుట్టే సంతానానికి తెలివితేటలు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయట!" అంది రూబీ భాటియా.

"అందుకనే మేం దగ్గర సంబంధాల మాట తలపెట్టం!" అన్నాడు గంగూలీ మరో పెగ్గు లాగిస్తూ. అవునన్నట్టుగా తలూపింది గంగూలీ శ్రీమతి 'కాబేరి'.

"బెంగాలీలందరూ తెలివైన వాళ్ళు" అని చెప్పుకొంటున్నాడు గంగూలీ!" అన్నాడు కల్నల్ రాంసింగ్.

"ఒక్క బెంగాల్‌లోనే కాదు, దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ – ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో ఎవరమూ దగ్గర సంబంధాలు చేసుకోం!" అన్నాడు బంసీలాల్.

"అంటే తెలుగు వాళ్ళలో తెలివితేటలున్న వాళ్ళు తక్కువంటారు మీరు!" అంది వైద్యనాథన్ భార్య అండాళ్ళు, తనూ ఓ రాయి విసురుతూ.

"అలాగని ఎలా అనగలం, కృష్ణమూర్తి బ్రిలియంట్ సైంటిస్ట్!" అంది రూబీ భాటియా.

"అంటే కృష్ణమూర్తి మేనరికం దంపతులకి పుట్టి ఉండడు! అతని తల్లిదండ్రులు వేరువేరు కటుంబాల నుంచి వచ్చిన వాళ్ళయ్యుంటారు!" అన్నాడు కల్నల్ రాంసింగ్. అతనిలో మిలటరీ వాసనలు పోలేదు. అనుకొన్నది అలానే చెప్పేస్తాడు.

కృష్ణమూర్తికి కోపం వచ్చింది. ఏదో అందామనుకొన్నాడు. అందరి చేతుల్లోనూ గ్లాసులు నిండుతున్నాయి. వాళ్ళ మనస్సులు మత్తుతో నిండుతున్నాయి. ఆ మత్తులో తెలిసో, తెలియకో వాగుతున్నారు. ఆడవాళ్ళు నిషాతో కాకపోయినా, మజా కోసం మాటల్లో అజ్యం పోస్తున్నారు. అందుకే ఆగిపోయాడు. సుజాత భర్త వంక దీనంగా, నిస్సహాయంగా చూసింది.

మొదటిసారిగా సుజాత మెదడులో ఆలోచనలు సుడులు తిరగసాగాయి. సుజాత తండ్రీ వాళ్ళు నలుగురన్నదమ్ములు. కృష్ణమూర్తి తల్లీ వాళ్ళూ అయిదుగురక్కచెల్లెళ్ళు, వెరసి, సుజాత తాతా మామ్మలకి తొమ్మండుగురు సంతానం! ఈ నలుగురన్నదమ్ములకీ, అయిదుగురక్కచెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళూ పేరంటాలు జరిగి, పుష్కలంగా కొడుకులూ, కూతుళ్ళూ పుట్టారు. ఆ పుట్టిన వాళ్ళకి అటూ యిటూ పదిహేను సంబంధాలు మాత్రమే పైకి వెళ్ళాయి. నిజానికి సుజాతదీ, కృష్ణమూర్తిదీ కూడా రెండోతరం మేనరికం. అన్ని మేనరికాలూ యిష్టంగానే జరిగాయా అంటే, లేదు. చాలా వయసు తేడాతో కొన్ని జరిగాయి. ఈడున్నా జోడు తగనివి మరికొన్ని జరిగాయి.

ఈ విషయంలో తనుమట్టుకు చాలా అదృష్టవంతురాలని పెళ్ళయిన కొత్తలో ఎంతగానో మురిసిపోయింది సుజాత. ఇద్దరికి చదువుంది. అందముంది. ఈడు జోడూ సరిగా కుదిరాయి. బావా మరదళ్ళ ప్రణయ గాథల్ని, శృంగార చేష్టల్ని అసంఖ్యాకంగా పత్రికా సాహిత్యంలో చదివిన సుజాత, కృష్ణమూర్తి భర్తగా లభించడంతో, అతని కోసం పోటీపడ్డ యితర బాబాయిల కూతుళ్ల మీద విజయం సాధించినట్టుగా గర్వపడిన మాట కూడా వాస్తవం!

భారతదేశంలోని చాలా సమాజాలు, ఈ మేనరికమనే వివాహ వ్యవస్థని అంగీకరించరన్న విషయం మొదటిసారిగా సుజాతకి కొట్టవచ్చినట్టు తెలిసింది. ఒక్కసారిగా బెంబేలు పడిపోయింది. కృష్ణమూర్తి కూడా, యించుమించుగా యివే ఆలోచనలతో సతమతమవుతున్నాడు. తెలుగు చలనచిత్రం 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రం హిందీలో తీసినప్పుడు ఘోరపరాజయం పొందింది. అలాగే 'నిన్నే పెళ్ళాడుతా' చిత్రం కూడా హిందీలో నామరూపాలు లేకుండా పోయింది. రెండింటి కథావస్తువుల్లోనూ మేనరికాలు తొంగిచూస్తాయి. కృష్ణమూర్తికి ఈ రోజున ఈ సత్యం

తెలిసింది.

"ఇస్లాం మతస్థుల్లో అక్కచెల్లెళ్ళ సంతానానికి వివాహాలు జరుగుతాయి" అన్నాడు బంసీలాల్.

"ఈజిప్టు రాజవంశాల్లో ఒకే తల్లిదండ్రుల బిడ్డలకి వివాహాలు జరిగిన దాఖలాలున్నాయి. అంటే అన్నాచెల్లెళ్ళకి వివాహాలు జరిగాయన్న మాటే కదా?" అన్నాడు కల్నల్ రాంసింగ్.

"అయితే వాటిని ఏ 'రికా' లంటారు?" ప్రీతి ముఖర్జీ అడిగింది.

"ఏ రికాలయినా యిటువంటి వివాహాలు సమాజపరంగా మంచివి కావు. సారీ మిస్టర్ కృష్ణమూర్తీ! నిన్నంటున్నానని అనుకోవద్దు. ఉన్న సంగతి చెబ్తున్నానంతే!" అన్నాడు బంసీలాల్.

బంసీలాల్ అన్న మాటలకి, మౌనంగా ఈ తతంగాన్ని చూస్తున్న అనితా, రంగారావులు లోలోపల సంతోషించారు.

కృష్ణమూర్తి ఇక మౌనంగా ఉండలేక పోయాడు. హఠాత్తుగా చిన్నప్పుడు చదువుకొన్న వేమన పద్యం గుర్తు కొచ్చింది.

**మేనమామ బిడ్డ మెరసి పెండ్లామాయె**
**అరవలందు నదియ చెల్లెలాయె**
**వలసిన పుణ్యంబు వలదన్న దోషంబు**
**విశ్వదాభిరామ వినుర వేమా!**

చదివి వినిపించి అర్థాన్ని వివరించాడు. అయినా ఈ నాలుగు పాదాల పద్యంలోనూ వేమన చెప్పినంత శక్తివంతంగా చెప్పలేక పోయాడు.

"ఎవరి ఆచారాలు వాళ్ళకుంటాయనుకో. అయినా కొన్ని ఆచారాలు మట్టుకు ఎబ్బెట్టుగా ఉంటాయిని మట్టుకు అంగీకరించక తప్పదు" అన్నాడు కల్నల్ రాంసింగ్.

"అవును, ఆ మాట నిజం? మనం సరిపెట్టుకొంటే సరిపోదు. అందరూ అంగీకరించాలి" అంది రూబీ సుజాత వైపు కొంటెగా చూస్తూ.

సుజాత కళ్ళనీళ్ళ పర్యంతమైంది. అక్కణ్ణించి వెళ్ళిపోదామని ఒక్క వెనకడుగు వేసి ఆగిపోయింది – వెళ్ళిపోతే మరింత హేళన చేస్తారేమోనన్న భయం కొద్దీ.

కాస్త దూరంగా బార్ దగ్గర స్టూల్ మీద కూర్చుని 'జిన్' సేవిస్తున్న చతురానన్ మిశ్రా, ఈ తీవ్ర సంభాషణల్ని వింటూనే ఉన్నాడు. అతనికి సుజాత పరిస్థితి చూసి జాలేసింది. "ఇంక చాలు, ఆపండి?" అన్నాడు గట్టిగా. అందరూ అటు వైపు తిరిగారు.

"ఇందాకట్నుంచీ మీ వ్యవహారం చూస్తున్నాను. మీరందరూ కలిసి పాపం వాళ్ళిద్దర్నీ ఆట పట్టిస్తున్నారు. నేనూ కొన్ని ప్రశ్నలడుగుతాను చెప్పండి".

"అడుగు" అన్నాడు గంగూలీ.

"బహుభార్యాత్వాన్ని గురించీ, ఈ రోజుకీ యింకా చక్రతా పర్వతసానువుల్లోని (డెహ్రాడూన్ దగ్గరి చక్రతా హిమాలయ పాదపర్వతాలు) ద్రుపదుల తెగలో ఉన్న బహుభర్తృకత్వాన్ని గురించీ, సమాజం పట్టించుకోని వేశ్యావృత్తిని గురించీ, సమాజం లోపల జరుగుతోన్న అక్రమ సంబంధాల్ని

గురించీ ఏమంటారు? వీటన్నిటితో పోలిస్తే, సమాజం అంగీకరించిన వివాహం ఏ రకమైనా ఫర్వాలేదు. ఇందాక మూర్తి చెప్పినట్టుగా ఎవరి ఆచార వ్యవహారాలు వాళ్ళవి. తప్పు పట్టడం భావ్యం కాదు!" అన్నాడు మిశ్రా.

ఎవరూ మాట్లాడలేదు. కృష్ణమూర్తికి కాస్తంత ధైర్యం చిక్కింది.

"యింకా వినండి, మీలో దత్తాత్రేయ పురాణం ఎవరైనా చదవడం కాని వినడం కాని జరిగిందా?" - చతురాసన్ మిశ్రా ప్రశ్నించాడు.

"అదేమిటి? ఆ పేరే వినలేదు!" అంది రూబీ భాటియా.

"మీ అందరితోనూ వచ్చిన చిక్కే యిది! ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం కోసం నిరంతర పఠనంలో బుర్రలు వేడెక్కించుకొనే మీరు, మధ్య మధ్యలో మెదడు శాంతించడం కోసం ఏ ఇంగ్లీషు క్రైం థ్రిల్లర్సో చదువుతారు కాని, మన వేదాల్ని గురించీ, ఇతిహాసాల్ని గురించీ, పురాణాల గురించీ తెలుసుకోవాలన్న ఇదితో ఏమి చదవరు! మన సంస్కృతిని అవగాహన చేసుకోవ్వడానికి, వేదాల వరకూ వెళ్ళనక్కర్లేదు కాని, పురాణేతిహాసాలతో కాస్తంత పరిచయం ఉంటే చాలు.

"సరే, సృష్టి ఎలా ఆరంభమైందో చెబ్తా వినండి. శ్రీమన్నారాయణుని నాభి కమలం నుంచి బ్రహ్మ అవతరించాడు. శ్రీమన్నారాయణుడెలా పుట్టాడని అడగొద్దు. అద్యంతాలు లేని అంతర్యామి అతడు, విశ్వశక్తిస్వరూపుడు.

"ఆ బ్రహ్మ మనసులోంచి పుట్టిన సప్తఋషుల్నీ బ్రహ్మమానసపుత్రులంటారు. బ్రహ్మ నీడలోంచి 'కర్దమ ప్రజాపతి' అనే పురుష దుద్భవించాడు. బ్రహ్మ దక్షిణ భాగం నుంచి స్వాయంభువమనువు అనే పురుషుడు జనియించాడు. అంటే సప్తఋషులూ, కర్దమ ప్రజాపతీ, స్వాయంభువ మనువూ బ్రహ్మ కుమారులే కదా!

"ఇకపోతే, బ్రహ్మ వామ భాగం నుంచి 'శతరూప' అనే స్త్రీ అవర్భవించింది. ఆమె మొదటి స్త్రీ. స్వాయంభువమనువు శతరూపని వివాహమాడాడు! వారు ఆది దంపతులు! స్వాయంభువ మనువు తన సోదరిని వివాహమాడినట్టే కదా!

"ఆది దంపతులకి ప్రియవ్రతుడూ, ఉత్తానపాదుడూ అనే కొడుకులూ, అకూతి, దేవహూతి, ప్రసూతి అనే పుత్రికలూ జన్మించారు. బ్రహ్మ మానవ పుత్రులలో ఒకరైన 'రుచి' అకూతిని వివాహమాడాడు. అంటే తన సోదరుడికీ, సోదరికి కలిగిన కూతుర్ని పెళ్ళాడినట్టే కదా! ఇది రెండవ జంట.

"మూడవ జంట ఎవరనుకొన్నారు? కర్దమ ప్రజాపతీ, దేవహూతిలది. ఇదీ పై రకమైన వివాహమే కదా? ఈ మూడవ జంటకి తొమ్మండుగురు కూతుళ్ళూ, ఒక కొడుకూ కలిగారు. ఆ కూతుళ్ళ పేర్లు - కల, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఊర్ధ్వ, చితి, ఖ్యాతి. విష్ణ్వంశతో పుట్టిన ఆ కుమారుని పేరు కపిలుడు.

"నాల్గవ జంట ఎవరంటే, బ్రహ్మ మానవ పుత్రులలో ఒకరైన అత్రీ, ఈ తొమ్మండుగురు సోదరిలలో రెండవదైన అనసూయా, అంటే ఒక విధంగా తమ్ముడి కూతుర్నీ, మరో విధంగా

మనవరాల్నీ పెళ్ళాడినట్టే కదా!

"అత్రి సామాన్యుడు కాదు. అయుర్వేదాన్ని సృష్టించిన మహాముని. ఊర్ధ్వరేతస్కుడైన అత్రి తేజస్సు భావనాపూర్వక మిథునం ద్వారా అతని కంటి నుండి కింద పడబోతుండగా, వాయుదేవుడు దాన్ని అనంతంలోకి విసిరి కొట్టాడు. దిగంగన దాన్ని స్వీకరించి, గర్భం దాల్చి బ్రహ్మాంశతో అమృత స్వభావుడూ, ఓషధీగణపతీ, రజోగుణ ప్రధానుడూ అయిన చంద్రుణ్ణి కన్నది.

"అత్రి అనసూయల మరో పుత్రుడు, బ్రహ్మ విష్ణు, మహేశ్వరాంశలతో జనియించిన దత్తాత్రేయుడు, అద్భుత శక్తి సంపన్నుడు.

"శివాంశతో జన్మించిన మూడో పుత్రుడు నిర్లిప్తుడూ, మహాక్రోధీ అయిన దుర్వాసుడు. ఈ కాస్త పురాణమూ చాలు, సృష్టి ఎలా ఆరంభమయి విస్తరించిందో చెప్పడానికి. ఈ కాస్తా చాలు, పునరోత్పత్తి ఎలా మొదలైందీ చెప్పడానికి.

"ఇంకో విచిత్రమేమిటంటే, బ్రహ్మ అయిదు శాఖల అవిద్యని సృష్టించాడు. అవి, తమస్సు, మోహము (దేహాభినివేశం), మహామోహము (భోగాభినివేశం) , తామిస్రము (క్రోధము), అంధతామిస్రము (తనకే విధమైన ధన, భోగ హానిలు కలిగినా, మృతతుల్యుణ్ణే అనుకోవడం). ఆ తర్వాత తొలి మానవులు 'సనకసనందనా'దుల్ని సృష్టించాడు. అయితే వాళ్ళు ఆ అవిద్య తాలూకు అయిదు గుణాల్నీ సంతరించుకోక, గృహస్థ ధర్మాలు స్వీకరించక, సృష్టి కార్యాన్ని విస్తరించని రాగద్వేష విహీనులూ, అంతర్ముఖులూ, తపోనిష్ఠాగరిష్ఠులుగా ఉండిపోవడంతో, బ్రహ్మ ముందుగా సప్తఋషుల ద్వారానూ, ఆ తర్వాత యితర ఋషుల ద్వారానూ పునరోత్పత్తిని సాధించాడు. కాలక్రమేణా ఋషుల పేరిటి గోత్రాలతో వంశాల్ని నిర్వచించడం జరిగింది.

"ఇంతెందుకు? బైబిలు తీసుకోండి సృష్టికర్త ముందుగా 'ఆదాము'నీ, అతని వెన్నుముకలోంచి 'అవ్వ'నీ సృష్టించి, అది దంపతుల్ని చేశాడు. ఆ తర్వాత.....?

"విజ్ఞానశాస్త్ర పరంగా చూసినా, తొలి మానవ జంటల్లోంచి పునరోత్పత్తి కార్యక్రమం ఎలా కొనసాగిందీ ఊహించడం కష్టం కాదు. ఈ మాత్రం జ్ఞానం ఉంటే ఈ రోజు మీరిలా ప్రవర్తించే వారు కాదు. స్త్రీ పురుష సంగమానికి ఆమోదముద్రయిన వివాహానికి, కాలమాన పరిస్థితులని బట్టి ఒక్కో సమాజం ఒక్కో విధంగా రూపు నిచ్చింది, నిర్వచించింది. ఆదిని తలుచుకొని, ప్రస్తుతాన్ని సమన్వయించుకోవడానికి ప్రయత్నిస్తే, కొన్ని అసంబద్ధతలు కానవస్తాయి. ముక్కూ మొహం తెలియని, ఏ విధమైన చుట్టరికమూ లేని సంబంధాలైనా, సగోత్రీకులయితే వదులుకొంటారు! లేదా గోత్రం ఒకటి కానంతవరకూ, ఎంతటి దగ్గర సంబంధాలైనా చేసుకొంటారు! గోత్ర, బీజ, క్షేత్రాంశాలని ప్రధానంగా తీసుకొని, దేశంలోని వేర్వేరు సమాజాలు తమ కనువైన రీతిలో వివాహాల్ని నిర్వచించుకొన్నాయి. పోనీ వావివరుసలూ, సగోత్రాలూ అడ్డొస్తాయనుకొన్నా, జాతి, మత, కుల భేదాలూ, అంతస్తులూ కూడా వివాహాలకి అడ్డు తగలడం మీకు తెలియంది కాదు. మూలకారణం సాంప్రదాయాల సంఘర్షణ తప్ప మరోటి కాదు.

"అందుచేత నేను చెప్పేదేమిటంటే, తను పుట్టిన సమాజం అంగీకరించిన వివాహవ్యవస్థ పరిధిలో, మేనరికాలు కానీండి, మరే రికాలు కానీండి తప్పు కావు! కృష్ణమూర్తీ మీ వేమన పద్యం ఈ మాటు తీరుబడిగా చెప్పు, హిందీలో వ్రాసుకొని కంఠస్తం చేస్తాను" - చతురాసన్ మిశ్రా ముగించాడు.

"లార్డ్ బ్రౌన్ వాటిని ఇంగ్లీషులో సమీక్షణం చేశాడు. ఆ కాపీని సంపాదించి మీ కిస్తాను" అన్నాడు కృష్ణమూర్తి చతురాసన్ మిశ్రా వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ.

"సారీ సుజాతా! మీ ఆచారాల పట్ల కొంత ఆశ్చర్యంతోనూ, పూర్తిగా అజ్ఞానంతోనూ అన్నానే కాని, మరో దురుద్దేశం లేదు. ప్లీజ్, ఏమీ అనుకోవద్దు!" అంది సుజాత చేతులు పట్టుకొంటూ రూబీ భాటియా.

'దొంగ నాటకాలాడుతొంది!' అనుకొంది సుజాత మనసులో కసిగా. అయినా సభ్యత కోసం "ఫర్వాలేదు, టేకిట్ ఈజీ!" అంది, పైకి లేని నవ్వు తెచ్చుకొంటూ.

డిన్నర్ తర్వాత ఒక్కొరొక్కరూ నెమ్మదిగా క్లబ్ భవనం వీడి వెళ్ళిపోసాగారు. కృష్ణమూర్తి మిశ్రా సపోర్టుకి మరోసారి అతనికి కృతజ్ఞతలు తెలుపుకొని సుజాతని తీసుకొని నిష్క్రమించాడు.

గంగూలీ చతురాసన్ మిశ్రా పక్కగా చేరి "గురూ, ఇందాకా నువ్వు చెప్పిందంతా నిజమేనా?" అని అడిగాడు కుతూహలంగా.

"నిజమో కాదో ఎవరెరుగుదురుకాని, దత్తాత్రేయ పురాణంలో నేను చదివిన సంగతి మటుకు నిజం. ఒక్కోసారి మనం అనాలోచితంగా అన్న మాటలు, ఎదుటివారి జీవితాల్ని ఎలాంటి మలుపులు తిప్పుతాయో ఊహించడం కష్టం. రూబీ భాటియా తెలిసో, తెలియకో రగిలించిన చిన్న నిప్పురవ్వ ఈ క్లబ్‌లోనే మంటల్ని రేపింది.

ఆ మంటలు మరింతగా చెలరేగి, సుజాతా కృష్ణమూర్తిల దాంపత్య జీవితంలో ఏరకమైన మానసిక సంక్షోభాల్ని కలిగిస్తాయేమోనన్న భయంకొద్దీ, ఆది సృష్టిని గురించి చెప్పాల్సి వచ్చింది. కృష్ణమూర్తి లాంటి బ్రిలియంట్ సైంటిస్ట్ మానసికంగా క్రుంగిపోతే, మన ఈ ప్రభుత్వ సంస్థకే నష్టం!" అన్నాడు చతురాసన్ మిశ్రా. అంతేకాని ఇటువంటి వివాహ వ్యవస్థని గురించి తన మనసులోని మాటని గంగూలీకి చెప్పదలచుకోలేదు మిశ్రా.

"గురుజీ నువ్వు పబ్లిక్‌రిలేషన్స్ అఫీసరుగా ఎంతటి సమర్థుడవో ఇప్పుడు నిజంగా తెలిసొచ్చింది!" అన్నాడు గంగూలీ నిండు హృదయంతో స్పందిస్తూ.

చతురాసన్ మిశ్రా కథనం సుజాతా కృష్ణమూర్తులకేపాటి నైతిక బలాన్నిచ్చిందీ అంటే, మేనరికమనబడే మన వివాహవ్యవస్థే సమాధానం చెప్పాలి మరి!

(ఈ రకపు వివాహబంధంపై, ఇతర రాష్ట్రాల వారు నొసలు ముడిచి, వింతపడడం నిజం. అనాదిగా వస్తున్న ఆచారాన్ని అవహేళన చెయ్యడం నా ఉద్దేశ్యం కాదు. అయితే, వైద్యశాస్త్రం చెప్పే జన్యుపరమైన లోపాల్ని దృష్టిలో ఉంచుకొని ఈ రకపు వివాహ వ్యవస్థని మార్చడం మంచిదేమో?

\- రచయిత)